## పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరికలు

● వచ్చే వారం వర్షాల సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్రమైన ఎండలు, వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ కేంద్రం అధికారులు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో శుక్రవారం అత్యధికంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో 46.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, పెద్దపల్లి జిల్లా రామగుండంలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలుచోట్ల వడగాల్పులు కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం మే 30 సాయంత్రం నుంచి మే 31 ఉదయం వరకు కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం కొనసాగే అవకాశం ఉంది. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశముందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్న వేళల్లో అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**మారనున్న వాతావరణం..**

అయితే జూన్ తొలి వారం నుంచి రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారి, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముండగా, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మే 31 నుంచి జూన్ 2 వరకు రాష్ట్రంలోని ఉత్తర, మధ్య, దక్షిణ జిల్లాల్లో వర్షాల ప్రభావం విస్తరించే అవకాశం ఉందని చెప్పారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. జూన్ 1 నుంచి జూన్ 5 వరకు హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గి, హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## పట్టణ పేదలందరికీ అధునాతన ఇళ్లు

● ఏడాదిలో లక్ష గృహాల నిర్మాణానికి ప్రణాళిక
● రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
● బంజారాహిల్స్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/హైదరాబాద్ : పట్టణ పేదలందరికి అధునాతనమైన ఇళ్లు నిర్మించి ఇస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బంజారాహిల్స్‌లో శనివారం ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ పేదల జీవనోపాదికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. తొలివిడతలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడమే కాకుండా వాటి నిర్మాణాలు ఏడాదిలోగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట, ఇళ్లు 30 నుంచి 40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలన్నీ ఒకే చోట అందుబాటులో ఉండేలా సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రభుత్వంపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖమైన సంస్థలకు నిర్మించే బాధ్యతను అప్పగిస్తున్నామని చెప్పారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్ఆర్‌నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిఐజి కార్యాలయం, గోల్కొండ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కార్యాలయాలు వస్తాయన్నారు. వీటివల్ల ఈ ప్రాంత వాసులకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్ష్యత వహించగా ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## డిజిపిని కలిసిన సిపిఐ నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్: నూతనంగా తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సి.వి.ఆనంద్‌ను తన కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.కే.జానీమియాలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు మరింత ప్రాధాన్యతనిస్తూ సమర్ధవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ డిజిపి సి.వి.ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పారదర్శకంగా అర్హుల జాబితా తయారీ

● ఉద్యమ కారుల గుర్తింపు విధివిధానాలకై జూన్ 4న అఖిలపక్ష సమావేశం: కమిటీ చైర్మన్ కె.కేశవరావు



ప్రజాపక్షం/హైదరాబాద్: జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు అధ్యక్షతన శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డిలు సంబంధిత ఉన్నతాధికారులతో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా.కె.కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, విద్యార్థులు, ఆర్‌టిసి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, జిఎడి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్, వరంగల్
ప్రాథమిక ప్రకటన
ఫారం - VI

(భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ 1 రూల్ 19 రీడ్ విత్ తెలంగాణా సవరణ చట్టం, 2016 (నెం.21/2017))

వరంగల్ జిల్లా రాజ పత్రము నెం.33/వరంగల్/2026 తేదీ: 25-05-2026
'శ్రీయుత జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఉత్తర్వు నెం.జి./ 1186 /2026, తేదీ: 25-05-2026
ఆర్.సి.నెం. బి /952/2026 తేదీ: -05-2026

జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఆదేశానుసారం, వరంగల్ జిల్లాలోని గన్నవరం గ్రామము, రాయపర్తి మండలంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ. 4-08 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా 5R-1L-7L మరియు 7R-1L-7L డిస్ట్రిబ్యూటరీ నష్కల్ కెనాల్స్ వరక నిర్మాణం కొరకు, ఈ దిగువ చూపిన భూములు అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ - 1 రూల్ 19 రీడ్ విత్ తెలంగాణా సవరణ చట్టం, 2016 (నెం.21/2017) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 63 ఇరిగేషన్ & కాడ్ తేదీ: 29-07-2017 ద్వారా ఈ యొక్క (JCRDLIS) ప్రాజెక్ట్ ప్రజా ప్రయోజనార్థం భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం 30/2013 రీడ్ విత్ తెలంగాణా సవరణ చట్టం, 2016 (నెం.21/2017) లోని సెక్షన్ 10ఎ లోని నిభందనలు అనుసరించి చాప్టర్-2 లోని సామజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3 లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు మినహాయింపబడినది.

కావున, ఈ ప్రాజెక్ట్ వరంగల్ జిల్లాలోని గన్న వరం గ్రామము, రాయపర్తి మండలంలో ఉన్న విస్తీర్ణం **ఎ. 4-08 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణలో ఉన్నదని ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది.

షెడ్యూల్

గ్రామం: గన్నవరం మండలం: రాయపర్తి జిల్లా: వరంగల్

| క్రమ సంఖ్య | సర్వే నెం./ ఇంటి నెం. | [illegible] | భూమి రకం | భూసేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గుం) | భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|---|---|
| 5R-1L-7L డిస్ట్రిబ్యూటరీ నష్కల్ కెనాల్ కి.మీ. 1.378 నుండి 1.938 వరకు | | | | | | |
| 1 | 152 | మెట్ట | పట్టా | 0-33 | పట్టేదారులు (భూభారతి ప్రకారం)<br>బుర్ర రాకేష్ తండ్రి ప్రభాకర్<br>మునిగల కవిత భర్త వేణు<br>కోటమర్తి కవిత భర్త కుమారస్వామి<br>జన్నపు రెడ్డి విక్రం రెడ్డి తండ్రి వేమన్ రెడ్డి<br>కోటమర్తి కుమారస్వామి తండ్రి కొమురయ్య | |
| 2 | 151 | మెట్ట | పట్టా | 1-20 | పట్టేదారులు (భూభారతి ప్రకారం)<br>చిలుమల్ల మల్లయ్య తండ్రి అయిలయ్య<br>కొండోజు పున్నామాచారి తండ్రి చంద్రమౌళి<br>కొండోజు కుమారస్వామి తండ్రి చంద్రమౌళి<br>యమసాని రాధిక భర్త శ్రీధర్<br>చిల్మల్ల నర్సయ్య తండ్రి అయిలయ్య<br>చిల్మల్ల ఎల్లయ్య తండ్రి అయిలయ్య<br>చేలుముల్ల అనిల్ తండ్రి రోశయ్య<br>చిల్మల్ల కొంరయ్య తండ్రి అయిలయ్య<br>చిలముల్లా యాకమ్మ భర్త రోషయ్య<br>గోలి సమ్మయ్య తండ్రి లక్ష్మయ్య<br>అంకుశ బేగం భర్త మహమ్మద్ జాఫర్<br>పిడుగు రజిత భర్త సుధాకర్ | |
| 3 | 150 | మెట్ట | పట్టా | 1-17 | పట్టేదారులు (భూభారతి ప్రకారం)<br>కొత్త శ్రీనివాస్ రెడ్డి తండ్రి ఖాసి రెడ్డి<br>గడ్డం సురేందర్ తండ్రి యాకయ్య<br>గడ్డం సమ్మయ్య తండ్రి యాకయ్య<br>కామిడి వెంకట్రామ్ రెడ్డి గార్డియన్<br>కామిడి యశోద భర్త జలంధర్ రెడ్డి | |
| | మొత్తం | | | 3-30 | | |
| 7R-1L-7L డిస్ట్రిబ్యూటరీ నష్కల్ కెనాల్ కి.మీ. 1.378 నుండి 1.938 వరకు | | | | | | |
| 1 | 181 | మెట్ట | పట్టా | 0-11 | పట్టేదారులు (భూభారతి ప్రకారం)<br>ఉల్లెంగుల వెంకటయ్య తండ్రి వెంకయ్య | |
| 2 | 182 | మెట్ట | పట్టా | 0-07 | పట్టేదారులు (భూభారతి ప్రకారం)<br>కామిడి పరుశురాం రెడ్డి గార్డియన్<br>కామిడి యశోద భర్త జలంధర్ రెడ్డి<br>నందబోయిన యాకయ్య తండ్రి పుల్లయ్య<br>జన్నపురెడ్డి విశ్వశాంత్ తండ్రి పుల్లా రెడ్డి<br>నందబోయిన సారయ్య తండ్రి పుల్లయ్య<br>సుంకరి ఉప్పలయ్య తండ్రి చంద్రయ్య<br>నందబోయిన రవీందర్ తండ్రి పుల్లయ్య | |
| | మొత్తం | | | 0-18 | | |
| | పూర్తి మొత్తం | | | 4-08 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, 2013(నెం.30/2013) నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం రీడ్ విత్ తెలంగాణా సవరణ చట్టం, 2016 (నెం.21/2017) సంబంధిత భూయజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారిచేయనైనది.
భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కల్లెక్టరు, వరంగల్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదేనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖి చేసుకోవచ్చును.
జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భూసేకరణ ఆధికారి / రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, వరంగల్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.
భూసేకరణ విషయములో సంబంధించిన భూయజమానులకు ఏదేనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, వరంగల్ లేదా భూసేకరణ ఆధికారి / రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ గారికి లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది.
ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల, ముందు వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు, రెవెన్యూ డివిజనల్ అధికారి, వరంగల్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వరంగల్
సం/- జిల్లా కలెక్టర్ వరంగల్
DIPR RO NO.260/LA/PP/Advt/Pub/2026-27


## నకిలీ విత్తనాలు అమ్మితే పిడియాక్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్: సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాల కొనుగోలులో అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. నకిలీ, కల్తీ విత్తనాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం నాడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలంగాణ పోలీస్ అధికారిక ఖాతా ద్వారా రైతులకు పలు కీలక సూచనలు చేస్తూ ఒక పోస్టర్ను విడుదల చేశారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు, అలాగే కల్తీ వ్యాపారుల ఆటకట్టించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పోలీసులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎవరైనా అమాయక రైతులను మోసం చేస్తూ కల్తీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠినమైన 'పిడి యాక్ట్' నమోదు చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

కల్తీ విత్తనాల విషయంలో రైతులు, ప్రజలు అస్సలు ఉదాసీనంగా ఉండకూడదు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు విడిగా (లూజుగా) అమ్మే విత్తనాలను కొనుగోలు చేయకండి. నకిలీల భరతం పట్టడంలో, వారిని పట్టుకోవడంలో ప్రజలు కూడా పోలీసులతో భాగస్వాములు కావాలి. రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ కల్తీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, తద్వారా నష్టాల బారిన పడకుండా జాగ్రత్తపడాలని పోలీసులు ఈ పోస్టర్ ద్వారా అవగాహన కల్పించారు.

## ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణానికి త్వరలో 'ఇంటిగ్రేటెడ్ కార్డులు'

ప్రజాపక్షం/హైదరాబాద్: సోషల్ మీడియాలో మహాలక్ష్మి పథకం స్మార్ట్ కార్డులపై జరుగుతున్న ప్రచారానికి తెలంగాణ ప్రభుత్వం తెరదించింది. జూన్ 2 నుండి రూ. 50 రుసుముతో ప్రత్యేక స్మార్ట్ కార్డులు జారీ చేస్తారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. అయితే, భవిష్యత్తులో రాబోయే ఒకే ఒక్క మల్టీపర్పస్ కార్డుతోనే ఈ సేవలు అందనున్నాయని తెలిపారు.




**అన్నింటికీ ఒకే కార్డ్..**
**అందులోనే 'మహాలక్ష్మి'**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకురాబోతున్న 'ఇంటిగ్రేటెడ్ కార్డ్స్'లోనే మహాలక్ష్మి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరచనుంది. ఈ ఇంటిగ్రేటెడ్ కార్డు అనేది ప్రభుత్వం అందించే వివిధ రకాల సంక్షేమ పథకాలు, సేవలను ఒకే గొడుగు కిందికి తెచ్చే సరికొత్త విధానం. భవిష్యత్తులో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయడానికి వేరే ఏ ఇతర ప్రత్యేక కార్డులు అవసరం లేకుండా, ఈ ఒక్క 'ఇంటిగ్రేటెడ్ కార్డు' ద్వారానే ప్రయాణించే అద్భుత సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించబోతోంది. పూర్తిస్థాయిలో ఖరారు కాని సమాచారాన్ని, ఇలాంటి అనధికారిక నమూనాలను నమ్మవద్దని ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం తరఫున ఈ ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ కార్డు ప్రాజెక్ట్ ఖరారైన వెంటనే, దానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా మీడియా ద్వారా ప్రజలకు వెల్లడించడం జరుగుతుందన్నారు. అప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో.. కాంగ్రెస్ సర్కార్ విఫలం

● కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, రైతాంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వం, రైస్ మిల్లర్లు, అధికారులు, దళారీల మధ్య రైతులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రజాప్రతినిధులు 'రైతుల గోస బిజెపి భరోసా' యాత్ర చేపట్టే వరకు కాంగ్రెస్ మంత్రులు కార్యాలయాలు దాటి బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్లు కేంద్ర ప్రభుత్వం చేయడం లేదంటూ ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణ, కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు వంటి ప్రాథమిక బాధ్యతలన్నీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి 52.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అందించేలా రాష్ట్ర, కేంద్రాల మధ్య ఒప్పందం కుదిరిందని, అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ వైఫల్యాలను కేంద్రంపై మోపే ప్రయత్నం సరికాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సన్నబియ్యం సేకరణపై చూపుతున్న శ్రద్ధలో సగం కూడా దొడ్డుబియ్యం పండిస్తున్న రైతులపై చూపడం లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఇతర రాష్ట్రాలు దొడ్డుబియ్యాన్ని కొనుగోలు చేసేవని, ఇప్పుడు అక్కడ కూడా ఉత్పత్తి పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు పక్కనబెట్టి, రైతు సంఘాలతో, అఖిలపక్షంతో మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఉన్నత స్థానాలే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలి

● నిరంతర విద్యా పర్యవేక్షణ ద్వారా అద్భుత ఫలితాలు
● 'అకడమిక్ సక్సెస్ మీట్ – 2026'లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్




ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రస్తుతం సాధించిన ఫలితాలు (టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్), (టిజిఇఎంఆర్ఎస్) విద్యార్థుల పట్టుదలకు, అంకితభావానికి, వారి జీవితాల్లో వచ్చిన గొప్ప మార్పునకు నిదర్శనమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. అత్యున్నత స్థానాల్లో స్థిరపడాలనే లక్ష్యంతో విద్యార్థులంతా మరింత కష్టపడి చదవాలని సూచించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్), తెలంగాణ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల (టిజిఇఎంఆర్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో 'అకడమిక్ సక్సెస్ మీట్ – 2026' (విద్యావిజయాల మహోత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ(సీతక్క), ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు నాయక్, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరై, వంద శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులను, నిబద్ధత గల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకకు టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్, టిజిఇఎంఆర్ఎస్ కార్యదర్శి కె.సీతాలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ నిరంతర విద్యా పర్యవేక్షణ ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్, టిజిఇఎంఆర్ఎస్ సంస్థలు చేస్తున్న నిరంతర కృషికి ఈ విజయమే ప్రతిబింబమని అన్నారు. ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల సాధికారత కోసం ఈ విద్యాసంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యం (ఎంఓయు) కుదుర్చుకున్న 'నాలెడ్జ్ పార్ట్‌నర్స్'ను ఈ వేడుకలో ఘనంగా సత్కరించారు. పొన్నం ప్రభాకర్, సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉపాధి రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలా? అనే భావన నుంచి తల్లిదండ్రులను బయటికి తేవాల్సిన భాధ్యత ఉపాధ్యాయులదే అని నొక్కి చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కళాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపి గోడం నగేశ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సంక్షేమ శాఖ) సబ్యాసాచి ఘోష్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి.. ప్రజలు సిద్ధంగా ఉన్నారు : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జెఎసి) ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహాధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో బడుగు, బలహీన వర్గాలకు 72 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, ఇప్పుడు 72 పైసలు కూడా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, పాల టెండర్లను సైతం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా జి.ఓ నెంబర్.17 తీసుకువచ్చారని మండిపడ్డారు. ఈ జి.ఓ రద్దయ్యే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకే దక్కుతున్నాయని విమర్శించారు. బిజెపి ఎంపి సిఎం రమేష్‌కు కూడా రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చారని ఆరోపించారు. రేవంత్ సర్కార్ తెచ్చిన అప్పులు, చిన్న కాంట్రాక్టర్లకు ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

**రేవంత్ రెడ్డి ఒక 'రెన్యూవల్ సిఎం' మాత్రమే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సిఎం కాదని, కేవలం 'రెన్యూవల్ సిఎం' అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీకి మూటలు మోసినన్ని రోజులే ఆయన కుర్చీ ఉంటుందన్నారు. వడ్లు కొనుగోలు కాక రైతులు ఆగ్రహంతో ఉన్నారని, కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2028లో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, 50వేల మంది యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతామని కెటిఆర్ హామీనిచ్చారు.

## ఎక్సైజ్ పోలీసుల దాడులు

**కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 4 కిలోల గంజాయి స్వాధీనం**

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మద్యం, నాటు సారా తయారీ కేంద్రాలు, గంజాయి రవాణాపై ఎస్టీఎఫ్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా ఉక్కుపాదం మోపుతున్నాయి. బార్లు, నాటు సారా బట్టీలపై వరుస దాడులు కొనసాగుతుండగా, పలు ప్రాంతాల్లో భారీగా మద్యం, గంజాయి, నాటు సారా తయారీ సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టిఎఫ్‌సి టీం రెండు బార్లు, ఎస్‌టిఎఫ్ బి టీం మూడు బార్లు, ఎస్‌టిఎఫ్ ఏ టీం మరో రెండు బార్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. బార్లలో గుర్తించిన లోపాలపై సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన దాడుల్లో 600 కిలోల బెల్లం, 50 కిలోల ఆలం స్వాధీనం చేసుకోగా, మరో కేసులో 24 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. మహబూబాబాద్‌లో 10 లీటర్ల నాటు సారా, కొత్తగూడెంలో 12 లీటర్ల నాటుసారాతో పాటు బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నల్లగొండ ఎస్ పరిధిలో వివిధ సైజుల్లో ఉన్న 29 లిక్కర్ బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా, ఎస్‌టిఎఫ్‌బి టీం ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. గంజాయి తరలింపులో పాల్గొన్న నిందితుల వివరాలపై అధికారులు ఆరా తీస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మద్యం, మత్తు పదార్థాలపై ప్రత్యేక డ్రైవ్ మరింత ముమ్మరం చేశారు.


మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ : బోయిన్‌పల్లి సర్కిల్ -03
నోటిఫికేషన్
NIT No.05/DB/EE-II/Bowenpally circle/MMC/2026-27 తేదీ: 29/05/2026
ముద్రించిన సర్టిఫికెట్లు, సప్లయ్ రిజిస్టర్ యొక్క సప్లయ్, పంపిణీ, వాటి ఖర్చు అన్ని మెటీరియల్ ఛార్జీల రవాణా మొదలైన వాటితో సహా పూర్తి.

| క్ర.సం. | వివరణ | యూనిట్ | పరిమాణం |
|---|---|---|---|
| 1 | పార్టిసిపేషన్, మెరిట్, ప్రశంస మొదలైన వాటికోసం సర్టిఫికెట్ల ముద్రణ, సప్లయ్, ఖర్చు, అన్ని మెటీరియల్ ఛార్జీలు మొదలైన వాటి రవాణాతో సహా పూర్తి. | each | 1 |
| 2 | సప్లయ్, డెలివరీ రిజిస్టర్ సహా ఖర్చు మరియు అన్ని మెటీరియల్ ఛార్జీలు మొదలైన వాటి రవాణాతో సహా పూర్తి. | each | 1 |

గమనిక : (i) సీల్డ్ కొటేషన్లను సంస్థ /ఏజెన్సీ లెటర్ హెడ్‌పై 02/06/2026 తేదీన లేదా అంతకు ముందుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్ 03, MMC కార్యాలయానికి సమర్పించాలి. (ii) పేర్కొన్న ధరపై జిఎస్‌టి 18% అదనంగా ఉంటుంది. (iii) లెటర్ ప్యాడ్‌పై జిఎస్‌టి నెంబర్‌ను తప్పకుండా పేర్కొనాలి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II బోయిన్‌పల్లి సర్కిల్-03, MMC
DIPR R.O. No. : 3274-PP/CL/ADVT/2026-27, Date: 30-05-2026

# పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

కలెక్టర్ కె. హరిత




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్న సందర్భంగా ఆమె అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించి, వాటిని చక్కగా అలంకరించాలని సూచించారు. గ్రామస్తులతో సహపంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి గ్రామానికి వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి**

బాలికలు, మహిళలు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళ వారోత్సవాలలో భాగంగా మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకువచ్చాయని తెలిపారు. సమాజంలో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలపై సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉల్లాస కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ యు మండల కేంద్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధురాలు మెస్రం జిజాబాయి ఉల్లాస పరీక్ష రాసి ఉత్తీర్ణులైనందుకు కలెక్టర్ ఆమెను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రమీల, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

## ‘గిన్నిస్ వరల్డ్ రికార్డు’లో మెదక్ చిన్నారి ప్రాణ్యా

ఐదేళ్ల వయసులోనే అరుదైన ఘనత



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారి ఎర్ర ప్రాణ్యా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. చిన్న వయసులోనే సంగీతం పై ఉన్న ఆసక్తి సాధనతో ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ కీబోర్డు ప్రతిభా పోటీల్లో ప్రాణ్యా పాల్గొంది. ఈ సందర్భంగా చిన్నారి గంటపాటు నిరంతరాయంగా కీబోర్డును వాయిస్తూ తన ప్రతిభను ప్రదర్శించి రికార్డు సృష్టించింది. ఈ పోటీల్లో ప్రపంచంలోని 22 దేశాల నుంచి సుమారు 2,000 మంది కీబోర్డు వాయిద్య కారులు పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 777 మందికి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం లభించగా, మెదక్ చెందిన ప్రాణ్యా కూడా ఆ జాబితాలో నిలిచింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రాణ్యాకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ప్రాణ్యా ఈ ఘనత సాధించడం పై తల్లిదండ్రులు ఎర్ర ప్రసాద్, సత్యప్రియ, కుటుంబ సభ్యులు, సంగీత గురువులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ గుర్తింపు సాధించిన ప్రాణ్యా భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పిసిలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.2,56,785 విలువైన విత్తనాల విక్రయాలపై అధికారులు స్టాప్ సేల్ విధించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు సక్రమంగా ప్రదర్శించకపోవడంపై డీలర్లను హెచ్చరించారు. వ్యవసాయ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ వరుణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, విజిలెన్స్ ఎస్ఐలు, డీలర్లు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) డిమాండ్




**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** కేంద్ర ప్రభుత్వం విపరీతంగా పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ‘సర్’ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలపై అధిక ధరల భారం వేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్నలు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఎన్నికల ముందు ఏలాంటి ధరలు పెంచబోమని ప్రజలకు మాయమాటలుచెప్పి ఆ తర్వాత విపరీతంగా పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచిందని మండిపడ్డారు. మరోవైపు ఎస్.ఐ.ఆర్. పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. మతం ముసుగులో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విభజన రాజకీయాలను, కుట్రలను ప్రజలందరూ అర్థం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, పెంచిన ధరలను తగ్గించే వరకు అన్ని వర్గాల ప్రజలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాం లక్ష్మణ్, బక్కన్న కె.లక్ష్మి, ఎస్.గంగన్న, వి.మహేందర్, అలాగే ముఖ్య నాయకులు గఫూర్, చాంద్‌పాషా, మోహన్, బాజీరావు , తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని చైతన్యం చేయడంలో విద్యార్థులే ముందుండాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులు నగరంలోని శ్రీనగర్ కాలనీలో పిడిఎస్‌యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్క గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. రాజకీయ శిక్షణ తరగతులకు సిపిఐఎంఎల్(మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ ప్రారంభ ఉపన్యాసకులుగా మాట్లాడారు. నర్ర రామారావు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జీవ పరిణామ సిద్ధాంతం అనే అంశంపై బోధిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సామాజిక అవగాహన, ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పలు ముఖ్యమైన అంశాలపై చర్చలు నిర్వహించామన్నారు. జీవపరిణామ సిద్ధాంతంతో ప్రపంచంలోని జీవజాతులు ఎలా అభివృద్ధి చెందాయో ప్రకృతి మార్పులకనుగుణంగా జీవులు ఎలా రూపాంతరం చెందాయో వివరించారు. మూఢ నమ్మకాలంటే శాస్త్రీయ ఆలోచన ఎంతో అవసరమని, సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాల్లో చురుగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనిల్, అవుర్, నసీర్, వైష్ణవి, నితిన్, సృజన్, నవీన్, సాయిబాబా, మహేష్, మణితేజ, దీపిక, మున్నా, జీవన్, మహేందర్, హేమాంజలి, అరవింద్, బన్నీ, జీవన్, రాంచందర్, మమత, తారచంద్, ప్రభాకర్, అరవింద్, రాజేష్, రాము పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు

కలెక్టర్ రాజర్షి షా



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ఎదగాలనే గట్టి సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల ‘‘యువతుల మాక్ పార్లమెంట్’’ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కిశోర బాలికలు మొబైల్ ఫోన్లు, ప్రేమ వ్యవహారాలు వంటి ఆకర్షణలకు, బాల్య వివాహాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు 9 నుండి 12వ తరగతి వరకు కీలకమైన సమయమని, ఈ దశలో బాగా చదివితే పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించవచ్చన్నారు. కేజీబీవీలలో విద్యార్థుల కోసం స్పేస్, ఆస్ట్రోనమీ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మాక్ పార్లమెంట్ ప్రదర్శించిన బాలికలను అభినందించి, అంగన్‌వాడీ టీచర్ మయూరితో పాటు పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి, అధికారులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యార్థి దశ నుండే బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా అదనపు డీసీపీ శుభం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించటం ద్వారా చట్టసభలలో జరిగే సమావేశాల తీరును కళ్లకు కట్టినట్లు ఆవిష్కరింపజేశారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజాభివృద్ధి తదితర అంశాలపై మ్మెల్యేలుగా వ్యవహరించి వారు ప్రశ్నలను లేవనెత్తగా సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ అద్యంతరం ఎంతో ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరించి కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తాము ఆశించిన దాని కంటే ఎంతో ఉత్తమంగా బాలికలు రాణించి మాక్ పార్లమెంట్‌ను విజయవంతం చేశారని ప్రశంసించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలు సమ దృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్షను ప్రదర్శించకూడదని వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. బాలికల విద్యకుతల్లిదండ్రులు ప్రాధాన్యతనివ్వటంతో కేరళలో అక్షరాస్యత 90శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా అక్షరాస్యతను గణనీయంగా వృద్ధి చెందేలా ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాయన్న, డీఈఓ అశోక్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, పద్మ, అధికారులు, విద్యార్థినులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు జరిమానా




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఈ వారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 138 నమోదు కాగా, రూ. 11.10లక్షల జరిమానా, తొమ్మిది మందికి జైలు శిక్ష విధించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో వారం వారం జరిమానాలు పెరుగుతున్నాయి. ఆ స్థాయిలో కేసులు కూడా పెరుగుతున్నాయి. కానీ ప్రజల్లో అవగాహన లోపం కారణమా... దీనికి అంతిమ పరిష్కారం లేదా... ప్రజలు, ప్రభుత్వం కలిసి ఈ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తీసుకోవాల్సిన చర్యలు ఏంటని సభ్య సమాజం ఆలోచించాల్సిన పరిస్తితి ఎంతైనా ఉంది.. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పిఎస్‌లలో గడిచిన వారంరోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 138 మంది పట్టుబడగా వారిని నిజామాబద్, బోధన్, ఆర్మూర్ కోర్టులలో వారిని హాజరు పరచగా ఇందులో 9 మందికి వారంరోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని, మిగిలిన వారికి రూ. 11,10,000 జరిమానా విధించమైనదని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీసు స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఈవారం 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వాహన తనిఖీలు నిర్వహించగా మొత్తం 138 కేసులు నమోదు చేయడం జరిగింది. ప్రజలు గమనించాల్సిన విషయాలు ఏమంటే మద్యం సేవించి వాహనాలు నడపరాదు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా తమవద్ద ఉంచుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి లైసెన్సులు ఆరునెలల పాటు సస్పెండ్ చేయబడుతాయన్నారు. మద్యంసేవించి వాహనం నడిపి అనుకోని రోడ్డు ప్రమాదం జరిగినట్లయితే ఇన్సురెన్సు లభించదన్నారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీసు వారికి దొరికినట్లయితే మైనర్, వెహికల్ ఓనర్‌పైన చార్జ్ షీట్ నమోదు చేయబడును, అలాగే జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఒకసారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలుశిక్ష విధించబడుతుందన్నారు. మోటర్ వెహికల్ యాక్టు 1989 (చట్టం సవరణ 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొదటిసారి పట్టుబడినట్లయితే రూ. 10 వేల జరిమానా లేదా ఆరునెలల జైలుశిక్ష లేదా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడినట్లయితే రూ. 15 వేల జరిమానా లేదా జైలుశిక్ష లేదా జైలుశిక్షతో పాటు జరిమానా విధించబడుతుందన్నారు. ఇన్ని గమనికలు ప్రతివారం వివిధ మాధ్యమాలలో ప్రజలకు అవగాహన పరిచినా కేసులు పెరిగిపోతుండడంతో ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రధాన కారణం కాగా ఈ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను తగ్గించుటకు ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు ఏంటనేది మేధావులు ఆలోచించాల్సిన అవసరమెంతైనా ఉందని తెలుస్తుంది.

## సరండి శివారులో అర్ధరాత్రి మట్టి తరలింపు



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని సరండి గ్రామ శివారులో రాత్రి వేళల్లో పెద్దఎత్తున మట్టి తరలింపు జరుగుతోంది. జెసిబి సహాయంతో తవ్వకాలు జరుపుతూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులోని ఒర్రెలు, వాగులు, కాలువలు, వ్యవసాయ భూముల పరిసరాల్లో ఈ తవ్వకాలు సాగుతున్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ట్రాక్టర్లు అతివేగంగా సంచరిస్తుండటంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. భారీ శబ్దాల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారు. అధిక లోడు వాహనాల వల్ల రహదారులు దెబ్బతినడమే కాకుండా దుమ్ము, ధూళి కాలుష్యం పెరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రశ్నించిన వారిని నిర్వాహకులు బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న మున్సిపల్ పాలకవర్గం



**ప్రజాపక్షం/రామాయంపేట:** సమాజంలో బంధాలు, అనుబంధాలు కనుమరుగవుతున్న ఈరోజుల్లో మానవత్వాన్ని చాటిచెప్పే ఒక హృదయవిదారక ఘటన రామాయంపేట మున్సిపాలిటి పరిధిలో చోటుచేసుకుంది. అనాథగా జీవిస్తూ మృతిచెందిన మహిళ శవానికి శనివారం మున్సిపల్ పాలకవర్గం దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించి తమ ఉదారతను చాటుకున్నారు. మున్సిపాలిటి పరిధికి చెందిన ఎరుకల విజయ అనే మహిళ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఆదరించేవారు లేక తన నివాసమైన పూరిగుడిసెలో ఆమె నరకయాతన అనుభవిస్తూ గత రెండు రోజుల క్రితం మృతిచెందింది. ఒంటరిగా ఉండడంతో ఆమె చనిపోయిన విషయం ఎవరికి తెలియలేదు. గుడిసెలో నుండి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి విజయ మృతిచెందిన విషయాన్ని మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజుకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన తన పాలకవర్గ సభ్యుల సహకారంతో అనాథగా పడి ఉన్న విజయ శవాన్ని చూసి చలించిపోయారు. పాలకవర్గమే దగ్గరుండి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు చేసి దహన సంస్కారాలు పూర్తిచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, దాకి స్వామి, సాలమాన్ రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం / భైంసా :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, దళారులకు జొన్నలు విక్రయించి నష్టపోవద్దని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైతన్య మండల మహిళా సమాఖ్య భైంసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంతోపాటు, కుబీర్ మండల కేంద్రంలో కుబీర్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు క్వింటాల్‌కు రూ. 3699 కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని, ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల సంక్షేమమే, ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

కుబీర్ మండల కేంద్రంలో రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను ముథోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ అందజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 80 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ, పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ‘స్నేహ’ కార్యక్రమంలో భాగంగా మాక్ పార్లమెంట్

బాలికల ప్రతిభ, హక్కులు, భద్రత, విద్య అంశాలపై చర్చ




**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘‘స్నేహ’’ కార్యక్రమంలో భాగంగా మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలు పోషిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ పని తీరును ప్రతిబింబించారు. బాలల హక్కులు, బాలికల భద్రత, బాల్య వివాహాల నిర్మూలన, విద్య ఆరోగ్యం, పారిశుద్ధ్యం, సైబర్ భద్రత వంటి అంశాలపై విద్యార్థినులు చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బాలికలు హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని, మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలను పెంపొందిస్తాయని అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరాలు, పొక్సో చట్టం, స్టాకింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్న కుమార్, డిడబ్ల్యుఒ హేమ భార్గవి, అడిషనల్ డిఆర్‌డిఒ సరస్వతి, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ధాన్యం అన్‌లోడింగ్‌పై నిరంతరం పర్యవేక్షణ

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లాలో ధాన్యం, కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం లోకేశ్వరం మండలంలోని సాత్‌గావ్, నగర్, గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. సాత్‌గావ్ గ్రామంలోని శ్రీదుర్గా రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, అక్కడ యంత్రాల సహాయంతో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాలవినియోగం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ మంది హమాలీలతో అధిక పరిమాణంలో ధాన్యం సంచులను అన్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల యాజమాన్యాలు కూడా ఇటువంటి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తనిఖీల సందర్భంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్‌లోడ్ చేసిన ధాన్యం పరిమాణం, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, లోకేశ్వరం తహసిల్దార్ సూర్యారావు పాల్గొన్నారు.

**ఇవిఎం గోదాం తనిఖీ**

కలెక్టరేట్ సమీపంలో గల ఇవిఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంకు సంబంధించిన అన్ని రికార్డులను, రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును సమీక్షించారు.

